


You have written a excellent piece on me, thank you very much. Gone to 24 years back and explaining our friendship roots, its shows the feel of concern which not forgettable, even though time rolls, distances expands. And my hearty congratulation to Koumudi entering into 2nd year and all of your team who made it very successful.

***Narsim(Artist), India Today***

***Chennai***

I am a regular reader of Koumudi. It is so great and I appreciate your's and Smt Kanthi Kiran's dedication and effort in bringing Koumudi accessible to the Telugu world with a wonderful quality. I just completed reading " Oosulade Jabilata" by Nishigandha. I enjoyed it so much and was very shocked to know that it was a real life experience. Your experience as well as the narration of the story took me back by several years. I enjoy Koumudi so much and one month feels like too long.

***Lakshmi Senapathi***

రొటీన్‌కి భిన్నంగా మీరు పల్లెటూరి నేపథ్యంగా తీర్చి దిద్దిన ముఖచిత్రం చాలా బావుంది. ‘పొలం గట్టు‘, ‘డొంక దారి‘..లాంటి మాటలతో బాటు వెనకాల కనిపించే పచ్చటి తోట, చిత్రం యొక్క అందాన్ని ద్విగుణీకృతం చేసింది. ముఖచిత్రాల విషయంలో మీరు తీసుకుంటున్న శ్రద్ధ అభినందనీయం!

*కె.ఎస్. లక్ష్మణ రావు*

*కాలిఫోర్నియా*

ఎప్పటిలానే నెల మొదటి తారీఖున నా డెస్క్‌టాప్ వాల్ పేపర్ మారిపోయింది. ప్రతిరోజూ కంప్యూటర్ ఆన్ చేయగానే ఈ బొమ్మ చూసిన వెంటనే మా వూరు గుర్తొస్తుంది. ఇంకేముందీ..బెంగ మొదలు. అందరి మనసులనీ కట్టుకుంటున్న మిమ్మల్ని ఎలా అభినందించాలో తెలీడం లేదు. హేట్సాఫ్..!

*ఎల్. కుమారస్వామి*

*ఫ్లోరిడా*

ఈ నెల ప్రత్యేక శీర్షికలు బావుంటున్నాయి. ప్రతి వ్యాసమూ ఒక దాన్ని మించి ఒకటి ఆసక్తికరంగా ఉంటున్నాయి. ఈ నెలలో వ్రాసిన రామాచారి గారి పరిచయం నచ్చింది. మీరు రాసినట్లే ప్రతిదీ వ్యాపారాత్మకమైన రోజుల్లో కూడా ఇలాంటి స్వార్థరహిత వ్యక్తులు ఉన్నారంటే చాలా ఆశ్చర్యంగా ఉంది. ఈ సారి ఇండియా వెళ్ళినప్పుడు వారిని కలుస్తానొకసారి.

*ఆరె సంజీవిని కుమారి*

*సింగపూర్*

విదేశాల్లో ఉన్న మాకు మాటివి లో వచ్చే చిన్నపిల్లల పాటల కార్యక్రమం చక్కటి కాలక్షేపం. అందులో చాలా మంది పిల్లలు 'రామాచారి సర్..' అంటుంటే ఎవరో అనుకున్నాం. ఈ నెల కౌముది చదివాక వారి వివరాలు చదివి ఆశ్చర్యపోయాము. వారి ప్రయత్నాలకి మా వంతు సహకారం అందించదలచుకున్నాము

*అందే శ్రీకంఠమూర్తి*
*దుబాయ్*

ఈ నెల ప్రత్యేకంలో గత కొద్ది నెలలుగా మీరు ప్రచురిస్తున్న వ్యాసాలు వైవిధ్యంతో కూడి ఉంటున్నాయి. ఒక నెలలో మేధావధానం కోసం బాలబాలికలకి కోచింగ్ ఇచ్చే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గురించి, మరో నెలలో హరిత పత్ర చిత్రకారిణి గురించి, ఇంకో నెలలో రేడియో సెలెబ్రిటీ గురించి, జనవరిలో డిటెక్టివ్ రచయిత గురించీ, ఈ నెలలో లలితకళార్చన చేస్తున్న సంగీత గురువు గారి గురించి - ఇవన్నీ చదవడం మాకు చాలా ఎన్‌లైటెనింగ్‌గా ఉంటోంది. ఇలాంటి వారందరితో ఇంటర్వ్యూలు చేసి మాకు విశేషాలనందిస్తున్న మీ శ్రమకి మా జోహార్లు.

*కొడాలి మధుసూదన రావు*
*బొంబాయి*

మారుతి రావు గారి 'వెన్నెల కాటేసింది' చదువుతుంటే వెన్నెల లోకంలో విహరిస్తున్నట్లే ఉంది. అలాంటి అమాయకమైన పల్లెటూరి పరిసరాలు, యవ్వనంలో వ్యక్తపరచుకోలేని అభిమానాలు, యుక్తవయసులోని పరిచయాలు.. ఎంతో బాగా వ్రాసారు. 40 సంవత్సరాల క్రిందటి పరిస్థితులు ఇప్పుడు కళ్ళముందు కదులుతున్నట్లున్నాయి. ఈ అరుదైన నవల అందిస్తున్న మీకు అభినందనలు.

*యలమంచిలి రాజ్యశ్రీ*
*బెంగుళూరు*

'వెన్నెల కాటేసింది' చదువుతుంటే ఒక నాటి 'చదువుకున్న అమ్మాయిలు' లాంటి సినిమా చూస్తున్నట్లుంది. సంభాషణలు ఇప్పటికీ కొత్తగా అనిపిస్తున్నాయి. మారుతీరావు గారిలోని రచయిత ఇందులో విశ్వరూపం చూపించారనిపిస్తోంది, మొదటి రెండు భాగాలు చదివాక.

రావూరి బ్రహ్మ కుమార్
కువైట్

ఇంత సస్పెన్స్ భరించలేమండి బాబూ.. 'చావు తప్పితే చాలు' అని కాదు ఈ 'నవల పూర్తిగా ఒకే సారి చదివితే చాలు' అనిపిస్తోంది. అసలే సస్పెన్స్ నవల. ఒక ఛాప్టరు నుంచీ మరో ఛాప్టరే కప్పదాటుగా వెళ్తుండడంతో మళ్ళీ మొదటి దానికి లింక్ ఉన్న ఛాప్టర్ వచ్చే దాకా సస్పెన్సే భరించలేకపోతున్నాం. దానికి తోడు మీరు నెలనెలా కొంత భాగంతో ఆపెయ్యడంతో సస్పెన్స్ మరింత పెరుగుతోంది.

లింగాల అభిరామ్, సెంట్‌పాల్
మినిసోటా

ఇన్ని సంవత్సరాల్లో ఎన్ని సస్పెన్స్ నవలలు వచ్చినా కొమ్మూరి సాంబశివరావు గారి ఈ నవల తన ప్రత్యేకతని నిలబెట్టుకుంది. పాఠకుల నాడిని కనిపెట్టిన మీ అభిరుచికి హేట్సాఫ్.

ఐనాపురం లావణ్య

ఫీనిక్స్, అరిజోనా

'కిటికీలో ఆకాశం' నవల సరికొత్త శైలిలో సాగుతోంది. ఒక్కోసంఘటనా చదువుతుంటే రెఫ్రెషింగ్ గా వుంది . అక్కడక్కడా బుచ్చిబాబు గారి రచనా శైలి కనిపిస్తోంది. ఈ తరం రచయితల్లో ఇలాంటి శైలి ఉన్న వారు అరుదు. కథకూడా అంతే పట్టుగా సాగుతుందని ఆశిస్తాను.

*ఆర్.కె. రత్నకుమార్*

*మేరీలాండ్*

'శివాని' సీరియల్ చదువుతుంటే 1970 లలో ద్వివేదుల విశాలాక్షి గారు వ్రాసిన కథలు గుర్తొస్తున్నాయి. ప్రింట్ మీడియాలో కూడా అభూత కల్పనల సీరియల్స్ వస్తున్న ఈ రోజుల్లో, మీరు కుటుంబ గాథా కథల్నీ, నిత్య జీవితంలో మనకెదురయ్యే పాత్రలతో కూడిన ధారావాహికల్నీ అందించడం శతథా అభినందనీయం.

*జగడాల నారీమణి*

*హైదరాబాదు*

వీరేంద్రనాథ్ గారు ఇస్తున్న టిప్స్, నాలాంటి అప్‌కమింగ్ రచయిత్రులకి చాలా ఉపయోగపడతాయి. ముఖ్యంగా మెలో డ్రామా అనే కాన్సెప్ట్‌ని సోదాహరణంగా ఆయన వివరించిన పద్ధతి బావుంది. ఒక వేపు ఫిక్షన్ రచనలు అందిస్తూ వాటిని వ్రాయడంలోని టెక్నిక్‌లు కూడ తెలియచేస్తున్న 'కౌముది' కి మా కృతజ్ఞతలు.

*బండ్ల రజనీ కుమారి*

*తెనాలి*

హంసగీతం కథ చదవడం ముగియగానే మనసంత ఒక విధమైన శూన్యం నిండింది. పరమ హంస కేరక్టర్ ని మరచిపోలేని విధంగ తీర్చి దిద్దిన రచయిత అభినందనీయులు.

*తిరుమలశెట్టి నరసింహారావు*

*డిట్రాయిట్, మిచిగన్*

'మాడాడీ రాక్షసుడు' వర్తమాన కాలంలో చిన్నపిల్లలు బలౌతున్న కాంపిటీషన్ల సంస్కృతికి అద్దం పట్టేలా ఉంది. మనకి మనమే మన పిల్లల బాల్యాన్ని దోచేస్తున్నామేమోనని ప్రతి ఒక్కరూ ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉందని ఈ కథ నిరూపిస్తుంది.

*ఎ.ఎస్.వి. రత్నకుమార్*

*సింగపూర్*

'జాతర' కథలో ఎన్నుకున్న ఇతివృత్తం, కథని చెప్పిన పద్ధతీ బావున్నాయి.

*డొక్కా నాగేశ్వరరావు*

*విజయవాడ*

ఫిబ్రవరి నెలలో మీరు ప్రచురించిన అనువాద కథ 'అంతరంగం' అద్భుతంగా ఉంది. సోమర్ సెట్ మాం, మల్లాది గారు గుర్తొచ్చారు కథ ముగియగానే. చివరంటా ఎంత సస్పెన్స్‌గా నడిపారో అంత సస్పెన్స్ తోనూ ముగించడం , కథ గురించి పదేపదే అలోచించేలా చేసింది. ఎక్కడా అనువాద కథ అన్న ఛాయలు కనిపించలేదు. అనువాదం చేసిన గౌరి గారిని కూడా సరిసమానంగా అభినందించి తీరాలి.

*కోపల్లె ఉషా సుందరి*

*జెర్మనీ*

'అంతరంగం' కథ ముగించగానే..'అబ్బా.. ఇ-మెయిల్ లో ఏం వుందో తెలిస్తే బావుండునే' అని అనిపించింది. పెళ్ళైన కొత్తలో భార్యా భర్తల మధ్య ఎదిగీ ఎదిగకుండా ఉండే అభిప్రాయాలనీ, రియాక్షన్లనీ చాలా సున్నితంగా చిత్రించిన ఒరిజినల్ రచయితా, అంత అందంగానూ తెలుగులో అందించిన అనువాద రచయిత్రీ ఇరువురూ అభినందనీయులే.

*చిలకలపూడి సత్యవతి*

*హైదరాబాదు*

'అనగనగా ఒక మంచి కథ' లో ప్రచురించిన 'మాచ్ ఫిక్సింగ్' కథ మనసులకి హత్తుకునేలా ఉంది. మారిపోతున్న మానవత్వపు విలువలకి దర్పణంలా ఉంది. చక్కటి టి.వి. ఎపిసోడ్ చూసినట్లనిపించింది. ఈ నరేందర్ గారు అంటే ఎవరు? కథా రచనాకాలం కూడా ప్రచురించలేదు.. ఇది కూడా ఈ శీర్షికల్లో వచ్చిన మిగతా కథల్లా 30-40 సంవత్సరాల క్రిందటి రచనేనా?

*దర్భా శివరామయ్య*

*తెనాలి*

*ఈ 'మాచ్ ఫిక్సింగ్' కథ 1988 ప్రాంతాల్లో వచ్చింది. కె.వి.నరేందర్ గారు సమకాలీన రచయితే.*

మొదటి సినిమాలో నెలకొకటిగా మీరు ప్రచురిస్తున్న కథనాలు కూడా సినిమా కథల్లానే ఉంటూన్నాయి. దశరథ్ గారి గురించిన సమాచారం చాలా ఆసక్తి కరంగా ఉంది. ఆయన తీసిన సినిమాలకంటే ఆయన మీద గౌరవం పెరిగింది, ఈ వ్యాసం చదివాక.

*పి.ఎస్.సహదేవుడు*

*కెనడా*

'కొత్తపాటలు తేనె ఊటలు' శీర్షికలో ఈ నెల హరిప్రియ గారు పరిచయం చేసిన పాట ఎప్పుడూ వినలేదు. మీరు వివరించాక మళ్ళీ మళ్ళీ విన్నాము. ఈ వర్ధమాన సినీ గేయ రచయితకి మా అభినందనాలు.

*సుంకరభవానీదేవి*

*కార్సన్ సిటీ*

'మాతృదేవోభవ' లో శ్రీరామ్ కుమార్‌గారి తల్లి గారి గురించి చదివి మా కళ్ళు చెమ్మగిల్లాయి. ప్రతినెలా కౌముది రాగానే చదివేది ఇదే శీర్షిక. ఎంతమంది తల్లులు , ఎన్ని త్యాగాలు చేస్తే ఎన్ని తరాలు ఎంత పురోగమించాయో కదా. మీరు నిర్వహిస్తున్న శీర్షిక మా అందరి మనసులకీ హత్తుకుపోయింది.

*కె.బి.ఎన్.రమణమూర్తి*

*ఒంగోలు*

శ్రీనివాస ఫణికుమార్ గారి 'టేకిట్ ఈజీ'లో మంచి పాయింట్‌ని తీసుకున్నారు. మాకు తెలిసిన ఒక ఫ్రెండ్ కూడా గత పదేళ్ళుగా వెదుకుతున్నాడు ఇల్లు కొందామని. వాస్తు కుదరడం లేదని వాయిదావేస్తున్నాడు. అమెరికాలో దిగజారిపోయిన ఇళ్ళ మార్కెట్ వాడిని కాపాడింది. బహుశా ఇదీ వాస్తు ప్రభావమేమో. ఏమైనా మంచి పాయింట్ తీసుకున్న ఫణికుమార్ గారు అభినందనీయులు.

*బి.వి.ఎస్.సత్యప్రసాద్*

*న్యూజెర్సీ*

'మిషన్ సూరన్న' కథ (అగ్రహారం కథలులో) చదవగానే ఒక్కసారి మావూరు వెళ్ళిపోయాను. ఈ సంచికలోని కథలన్నీ ఇలానే మనసుని కదిలించేలా ఉన్నాయి. 'హంసగీతం', ' మేచ్ ఫిక్సింగ్',' మాతృదేవోభవ',' అగ్రహారం కథలు' అన్నీ సున్నితంగా సాగి కరుణ రసానికి పెద్దపీట వేసాయి. థాంక్యు వెరీ మచ్.

*వెంపటి రాధాకృష్ణ*

*యు.కె*

రమణి గారి కాలమ్ దాటని కబుర్లు మాకు కాలమ్ తెలీకుండా చేస్తున్నాయి. చదువుతున్నంత సేపూ నల్లేరు మీద నడకలా ఉంటోంది. చదవడం పూర్తవగానే 'అరే అప్పుడే ఐపోయిందా? మరో రెండు పేజీలు ఉంటే బావుండునే అనిపిస్తోంది.

*వేదుల సుబ్రహ్మణ్యం*

*రాజమండ్రి*